అంతర మంత్రం

- ఒకే పొలంలో ఏడెనిమిది పంటల సాగు
- ఒక్క సాగుతో నష్టపోకుండా వినూత్నం
- పొలంగట్టుపైనా కందితో లాభార్జన

పిఠాపురం: మండల రైతులు ఉద్యాన సాగులో వైవిధ్యం చూపుతున్నారు. ఒకే పొలంలో ఏడెనిమిది రకాల అంతర పంటలు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. చెరకు, అరటి, దొండ, బెండ, వంగ, కాలీఫ్లవర్, కేబేజీ, ఆనప, చిక్కుడు, టమాట, మిరప, కంద, చేమకూర, ముల్లంగి, పెండలం వంటి కాయకూరలతో పాటు పూల తోటలను పెంచుతూ లాభాల బాటన పయనిస్తున్నారు. ఒక పంట నష్టం వచ్చినా మరో పంట ద్వారా ఆ నష్టాన్ని పూడ్చుకునేలా వైవిధ్యంగా సాగు చేయడంలో మండలంలోని విరవ, విరవాడ, కందరాడ, ఎఫ్‌కే పాలెం, గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చెందుర్తి, కొడవలి తదితర గ్రామాల్లో రైతులు పలు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఒక ఎకరం పొలంలో ఒక్కో మడిలో ఒక్కో రకం పంట సాగు చేయడంతో పాటు అంతర పంటల సాగు ద్వారా అధిక లాభాలు అర్జిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ రైతులు అంతర పంటలకు ప్రాధాన్యమిస్తున్నారు. పెండలం తోటల్లో చేమ అంతర పంటగా వేస్తుండగా కేబేజీ, కాలీఫ్లవర్ పంటల్లో అంతర పంటగా ముల్లంగి సాగు చేస్తున్నారు. బంతి తోటల్లో చిలగడదుంపలు, చేమ తదితర పంటలను, వంగ తోటల్లో మిరపను, మునగ తోటలో టమాట, మామిడి తోటల్లో కనకాంబరం, జామ తోటల్లో ఆకు కూరలు, ఉల్లి తోటల్లో కొత్తిమీర వంటి అంతర పంటలు సాగు చేస్తున్నారు. చివరకు పొలం గట్టును ఖాళీగా ఉంచకుండా కంది సాగు చేస్తూ అదనపు ఆదాయం అర్జిస్తున్నారు.


మునగతోటలో అంతర పంటగా టమాట

నష్ట నివారణకు మార్గం..

మునగ, బొప్పాయి, జామ వంటి పంటల సాగులో ముల్లంగి, పసుపు, టమాటా వంటి అంతర పంటలు సాగు చేయడం ద్వారా నష్టాలను కొంత వరకు నివారించ గలుగుతున్నాం. మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బంది అవుతోంది. రోజుకో రేటు వస్తుండడం వల్ల అయోమయానికి గురవుతున్నాం. ప్రభుత్వ సహకారం ప్రస్తుతం బాగుంది.

– పి.శ్రీను, రైతు, వన్నెపూడి, గొల్లప్రోలు మండలం

పెట్టుబడులకు అనుకూలం..

వరి తప్ప ఇతర పంటల్లో అంతర పంటల సాగుకు అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా ఉద్యాన పంటల సాగులో అంతర పంటలకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. అంతర పంటల వల్ల అదనపు ఆదాయం రావడంతో పాటు నిత్యం ఏదో ఒక విధంగా ఆదాయం రావడం వల్ల పెట్టుబడులకు ఇబ్బంది ఉండదు. అందుకే రైతులు అంతర పంటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉద్యాన వన శాఖ ద్వారా అంతర పంటల సాగుకు రైతులకు సూచనలు సలహాలు ఇస్తున్నాము. ప్రభుత్వ సహకారం అందించే ఏర్పాట్లు చేస్తున్నాము.

– అరుణ్‌కుమార్, ఉద్యానవన శాఖాధికారి , గొల్లప్రోలు


చేబ్రోలులో వర్షానికి నేలనంటిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు


తాటిపర్తిలో వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

తెగుళ్లతో అప్రమత్తం

- అకాల వర్షాలపై రైతులకు సూచనలు
- డీఆర్‌సీ వ్యవసాయ ఉపసంచాలకుడు హరి

పిఠాపురం: ఎండాకాలంలో అకాల వర్షాలు పంటలకు చేటు తెస్తాయి. తెగుళ్ల దాడిచేసే ప్రమాదం ఉంది. అధికారుల సూచనలు పాటిస్తే సమస్య ఉండదని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) వ్యవసాయ ఉప సంచాలకుడు బీవీఎస్‌సీ హరి సూచించారు. శుక్రవారం ఆయన సహాయ వ్యవసాయ సంచాలకురాలు బి.మాధవితో కలసి గొల్లప్రోలు మండలం తాటిపర్తి చేబ్రోలు, దుర్గాడ తదితర గ్రామాల్లో పర్యటించి వానలకు నేల కొరిగిన వివిధ పంటలను పరిశీలించారు. గొల్లప్రోలు మండలంలో వరి పంటకు తక్కువ నష్టమే కలిగిందన్నారు. అయితే వానల వల్ల పొడ తెగులు, దోమపోటు విజృంభించే అవకాశం ఉందన్నారు. మండలంలో వరి 444 ఎకరాలు, మొక్కజొన్న 50 ఎకరాలు, అపరాలు 222 ఎకరాలు, నువ్వు పంట 350 ఎకరాల్లో పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాగా తెలుస్తోందన్నారు. పంట నష్టం


దుర్గాడలో వర్షానికి నేల వాలిన నువ్వు పంటను పరిశీలిస్తున్న అధికారులు

అంచనా వేయడానికి ఆర్బీకే సిబ్బంది వీఆర్వోలతో కూడిన బృందాలను పంపామన్నారు. రైతులు తమ పంట నష్టాలపై ఈ బృందాలకు సమాచారం ఇచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు తగిన సూచనలు సలహాలు ఇస్తారన్నారు. వీరి వెంట స్థానిక వ్యవసాయాధికారి సత్యనారాయణ ఆర్బీకే సిబ్బంది, గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రేపు కార్మిక సంఘాల మహాసభ


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు

పిఠాపురం: భవన నిర్మాణ కార్మిక సంఘాల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మహా సభను విజయవంతం చేయాలని ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ పిలుపు నిచ్చారు. శుక్రవారం పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ అచ్చుతాపురంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘాల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మహా సభ నిర్వహించనున్నామన్నారు. ఈ సభకు వివిధ భవన నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కుంచే అంజిబాబు, పిఠాపురం డివిజన్ అధ్యక్షుడు నారాయణమూర్తి, భవన నిర్మాణ కార్మికులు రాయుడు గోవింద్, ఆర్.శ్రీను, డి.వెంకటరమణ పాల్గొన్నారు.

మెప్మాకు వాటర్ డిస్పెన్సర్ బహూకరణ


వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించిన యూనియన్ బ్యాంకు మేనేజర్లు

సామర్లకోట: వేసవిలో మహిళా సంఘాల సభ్యులు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్లు వైవీఎస్ఎస్ఎస్ కిరణ్, యశస్విని కామేషలు మెప్మా కార్యాలయానికి వాటర్ డిస్పెన్సర్ బహూకరించారు. ఇప్పటికే ఎస్‌బీఐ మేనేజర్ కంప్యూటర్ బహూకరించారని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు వాటర్ డిస్పెన్సర్‌ను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు.

సంపద కేంద్రాలతో ఆదాయం


చెత్తనుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

కొత్తపల్లి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని ఎంపీడీఓ భాస్కరరావు అన్నారు. మండలంలోని యండపల్లిలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తున్నట్టు తెలిపారు. కొమరగిరి, కొత్తపల్లి, వాకతిప్పతో పాటు పలు కేంద్రాల్లో ఎరువును తయారు చేసి గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా గ్రామల్లో చెత్తను నియంత్రించవచ్చన్నారు. పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్‌లకు ప్రజలు సహకరించాలని కోరారు.

వైఎస్సార్ బీమా అందజేత


బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచి రొంగల వీరబాబు

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామానికి చెందిన పెదిరెడ్ల వెంకటరమణమూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా అతని కుటుంబ సభ్యులకు రూ.10 వేలను తక్షణ సాయాన్ని సర్పంచి రొంగల వీరబాబు, ఎంపీటీసీ కొండపల్లి సూర్యనాగేశ్వరావు అందజేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పిఠాపురం: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు (ఎన్ఎంఎంఎస్) గొల్లప్రోలు మండలం చేబ్రోలు ప్రభుత్వ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు తొమ్మిది మంది ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం జె నూకరాజు తెలిపారు. జిల్లాలో అత్యధిక మంది విద్యార్థులు ఒక్క చేబ్రోలు హైస్కూలు నుంచే ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక బోధన


గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో పదో తరగతి పరీక్షా పత్రాలను భద్రపరుస్తున్న అధికారులు


సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో పదో తరగతి పరీక్ష పేపర్లు భద్రపరుస్తున్న ఉపాధ్యాయులు

- జిల్లాలో ప్రథమస్థానమే లక్ష్యం
- పోలీసుస్టేషన్లకు చేరుకున్న పదో తరగతి పరీక్ష పత్రాలు

పిఠాపురం: త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాలకు సంబంధించి పరీక్ష పత్రాలు ఆయా పోలీసుస్టేషన్లకు శుక్రవారం చేరుకున్నాయి. ఇప్పటికే వంద రోజుల ప్రణాళిక ద్వారా ప్రత్యేక తరగతులలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రథమ స్థానం సాధించడమే ధ్యేయంగా విద్యాశాఖ ప్రణాళికలను రూపొందించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఈ ఏడాది ప్రైవేటు విద్యార్థులకు ప్రత్యేకంగా పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థులకు 12 పరీక్షా కేంద్రాలు, ప్రైవేటు విద్యార్థులకు ఒక సెంటర్ ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభం కానుండగా అప్పటి వరకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణలు కొనసాగుతాయి. ఈ ఏడాది ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులకు మంచి అవగాహన కల్పించే దిశగా శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రోజుకో సబ్జెక్టుపై విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు.

పదో తరగతి ప్రశ్నాపత్రాలు పోలీస్‌స్టేషన్‌లో భద్రం

సామర్లకోట: వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వీటిని కస్టోడియన్, చీఫ్ సూపరింటెండెంట్ డిపార్టుమెంట్ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీల్ వేసి భద్రపరిచారు. కస్టోడియన్‌లుగా ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ, ఎస్.కొండారెడ్డిలు వ్యవహరించారు. మండల పరిధిలోని 9 పరీక్షా కేంద్రాలకు ఇక్కడి నుంచే ప్రశ్నాపత్రాలు అందజేస్తారన్నారు. చీఫ్‌లుగా మీనామాధురి, వై.శివ రామకృష్ణయ్య, కొరాడ శ్రీనివాస్, అనురాధ, నారాయణరావులు వ్యవహరిస్తారని తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ


వేట్లపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ మౌనిక, వైద్య సిబ్బంది

సామర్లకోట: వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రశాంత్, హిమావతిలు మాట్లాడుతూ టీబీ వ్యాధి బారిన పడినవారికి ఆరు నెలల పాటు మందులు ఉచితంగా ఇస్తామన్నారు. రోగులకు ఇచ్చిన మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. ఆరు నెలలుగా మందులు వాడుతున్న రోగులకు నెలకు రూ.3 వేలు చొప్పున ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పి.సుబ్బారావు, వై.రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవ సందర్భంగా పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో శనివారం పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం మందులను ఉచితంగా అందిస్తోందని డాక్టర్ మౌనిక అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశాలు ఉన్నారు.

అలరించిన సిక్కిల్ గాత్ర కచేరి

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు సిక్కిల్ గురుచరణ్ ఆలపించిన కృతులు ఆహూతులకు వీనుల విందు చేశాయి. సరస్వతీ గానసభ 19వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాలు శుక్రవారం సాయంత్రం స్థానిక సూర్యకళామందిర్‌లో ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు సిక్కిల్ గురుచరణ్ (చెన్నై) ఏర్పాటు చేసిన గాత్ర కచేరీ అలరించింది. వీరు ఖమాస్ రాగంలో 'సాంబశివ యవవే..', మాయమాళవగౌళ రాగంలో 'తులసీదళంచే..' తదితర కృతులు అలపించారు. అలాగే అన్నమయ్య, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితార్ తదితర వాగ్గేయకారుల కీర్తనలు అలపించారు. వీరికి వయోలిన్ ఎం.శ్యామనీలాద్రి రావు, మృదంగం ఎం.ఏడుకొండలు, ఘటం ఎస్.హనుమంతరావులు సంగీత సహకారం అందజేశారు. 26వ తేదీ వరకు వేడుకలు సాగుతాయని, కళాభిమానులు ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి కోరారు. గానసభ అధ్యక్షులు ఆంజనేయమూర్తి, కార్యదర్శి పి.రామకృష్ణ,వెంకట్రావు తదితరులు హాజరయ్యారు.


గాత్ర కచేరిలో కృతులు ఆలపిస్తున్న సిక్కిల్ గురుచరణ్ తదితరులు

కేసీబీఎస్‌తో మెరుగైన సేవలు

బోట్‌క్లబ్: ఖాతాదారుల సహకారంతో శతవసంతంలోకి అడుగుపెట్టిన ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ ద్వారా మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం జరిగిన కేసీబీఎస్ 2023–24 బడ్జెట్ సమావేశాన్ని చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు, ఇతర సభ్యులు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల కన్నా మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సహకార స్ఫూర్తితో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తున్న కేసీబీఎస్‌కు ఖాతాదారుల మన్ననల వల్లే శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తొలుత మేనేజర్ చీమలకొండ గంగాధరం బడ్జెట్ ప్రతిపాదనలను సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సంస్థ చార్టెడ్ అకౌంటెంట్ డీపీఆర్ స్వామి సభ్యుల ఆదాయపన్నుకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. తొలుత కేసీబీఎస్ మాజీ అధ్యక్షుడు కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసన్న లావణ్య పాల్గొన్నారు.

ఏటిగట్టుపై కారు బోల్తా

తాళ్లరేవు: గౌతమి గోదావరి ఏటిగట్టు రహదారిపై గోవలంక వద్ద శుక్రవారం రాత్రి కారు బోల్తా పడిన ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ తెలిపిన వివరాల మేరకు రాజమండ్రికి చెందిన నలుగురు యువకులు కారులో యానాం వచ్చారు. యానాంలో మద్యం తాగి తిరిగి ఏటిగట్టు రహదారిలో జొన్నాడ వైపుకు వెళుతుండగా గోవలంక గ్రామం వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కాకినాడ తరలించగా చికిత్స పొందుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లాన్ టెన్నిస్‌లో రోహిత్ ప్రతిభ


రోహిత్

నాగమల్లితోట జంక్షన్: హర్యానాలోని గుర్గాంలో ఈ నెల 17 నుంచి 24 వరకు జరిగిన జాతీయస్థాయి లాన్ టెన్నిస్ పోటీల్లో దుంపల రోహిత్ అండర్–14 విభాగంలో ప్రతిభ కనబరచి ద్వితీయస్థానం సాధించాడు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రోహిత్‌కు సేవ్ ద పీపుల్ ట్రస్ట్ నిధులు అందజేసి టోర్నీకి వెళ్లేందుకు సహకరించింది. రోహిత్ తండ్రి డాక్టర్ లింగరాజు కాకినాడ జేఎన్టీయూకేలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. రోహిత్‌కు శుక్రవారం ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పి.రామ్‌కుమార్, ఆస్ట్రేలియన్ కోచ్ టోడ్‌క్లార్క్, పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ రబ్బాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. టోడ్‌క్లార్క్ వేసవిలో హర్యానాలో జరిగే ప్రత్యేక వేసవి శిబిరానికి టోడ్‌క్లార్క్ రోహిత్‌ను ఆహ్వానించారు.

రూ.1.5 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): చారిత్రాత్మకమైన సంత చెరువు జమ్మిచెట్టు సెంటర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. రూ.1.5 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ పనులకు త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు–నాగేశ్వరి దంపతులు భూమి పూజ చేశారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగర ప్రముఖులు హాజరయ్యారు. చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ఆలయ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నగరంలోని ఆలయాల అభివృద్ధికి తోడ్పతున్నారన్నారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా జొన్నాడ చినబాబు రూ.25 లక్షలు ప్రకటించారు. విజయదశమి నాటికి పనులు పూర్తిచేసి దశమి ఉత్సవాలు నిర్వహించాలని తమ ఆకాంక్ష అన్నారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), వైఎస్సార్ సీపీ యువ నాయకులు మల్లిపాముల గణపతి, కంపర అప్పారావు, బి.అజయ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొలగాని దుర్గాప్రసాద్, ఐ.శ్రీను, ఇనుకొండ పట్టాభిరామయ్య, త్రిపురసుందరి ఆలయకమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జీ, కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు, స్థపతి శ్రీనివాసాచార్యులు, డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ కె.నాగేశ్వరరావు, ఈవో విజయభాస్కరరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రాయుడు వెంకటదుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సువర్ణాధ్యాయం


మాధవపట్నంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- మాధవపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం

సామర్లకోట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని మాధవపట్నం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, ఎలిమెంటరీ పాఠశాలను సైతం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దవులూరి దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించడానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైతే చాలు ఎలాంటి సిఫార్సులు అవసరం లేకుండానే పథకాలు నేరుగా ఇంటి ముంగిటకే వచ్చి చేరుతున్నాయని చెప్పారు. ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మేడిశెటి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణార్జునరావు, వైఎస్సార్‌సీపీ యువజన సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, తోట సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

5న ఉచిత భోజన పథకం ప్రారంభం

తాళ్లరేవు: తాళ్లరేవు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రతి బుధవారం ఉచితంగా భోజనం అందించే పథకాన్ని ఏప్రిల్ 5వ తేదీన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బుధవారం సుమారు 100 మంది గర్భిణులకు ఉచితంగా అన్నదానం చేస్తారన్నారు. సమావేశంలో ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఎ.లక్ష్మీనారాయణ, లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి

వ్యవసాయ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లరేవు: ప్రభుత్వం ఆర్బీకే కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బాబూరావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఇంజరం, నీలపల్లి, పటవల రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించి సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంఘాల గ్రూపులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్నామని, ఆర్బీకే కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. కొంతమంది రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి వాటిని పొందొచ్చని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.


నీలపల్లి రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన వ్యవసాయ శాఖ ఏడీఏ బాబూరావు

వ్యక్తిగత కక్షలు మానుకోవాలి

కాకినాడ సిటీ: మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై సచివాలయ కార్యదర్శులు వ్యక్తిగత కక్షసాధింపు చర్యలు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కాకినాడ కమిటీ ఆధ్వర్యంలో జగన్నాథపురం ఐదో సర్కిల్‌లో హాజరు కార్యాలయం వద్ద ధర్నా చేసిన సందర్భంగా మాట్లాడారు. మున్సిపల్ కార్మికులపై వ్యక్తిగత కక్షసాధింపు చర్యలు మానుకోవాలని, సచివాలయ కార్యదర్శి రాజును సస్పెండ్ చేయాలని, మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై చులకన భావం తగదని అన్నారు. రాజు అనే కార్యదర్శి కార్మికుల పట్ల చులకన ప్రదర్శిస్తున్నారని, ఎదురుచెప్పినవారిని ఉద్యోగం నుంచి తొలగిస్తానని ఆందోళనకు గురిచేస్తున్నారని అన్నారు. బండి అప్పన్న అనే కార్మికుడిపై వ్యక్తిగత కక్షతో విధుల నుంచి తొలగించారని, అతనిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ కార్మికులను గౌరవించకపోయినా, మహిళల పట్ల అమర్యాదగా ప్రవర్తించినా, వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలు చేపట్టినా కాకినాడలో అన్ని సర్కిళ్లలో ఉన్న మున్సిపల్ కార్మికులు పనులు నిలిపివేసి న్యాయం జరిగే వరకు పోరాడతామని ప్రసాద్ అన్నారు. ఈ ధర్నాలో నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


వ్యక్తిగత సాధింపు మానుకోవాలని ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు